సాక్షి
ఒడిశా
ఆదివారం । 20 । జూలై । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 4,94,388
బంగారం : 1 గ్రాము 450 మిల్లీ గ్రాములు
వెండి : 15 గ్రాముల 800 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



రగులుతున్న ఆందోళనలు

బాలికపై హత్యాయత్నం జరగడంతో ఆందోళనలు రగులుతున్నాయి. రాజధానిలోనూ నిరసనలు జరిగాయి. - 8లో.



రాష్ట్రంలో శ్వేత విప్లవం

రాష్ట్రంలో శ్వేత విప్లవం రావాలని సీఎం ఆకాంక్షించారు. ఒప్పంద కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. - 8లో.

నలుగురు బిడ్డలను కనేవారిని అరెస్టు చేయాలి



సబ్‌కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న దృశ్యం

జయపురం: దేశంలో ప్రజలందరికీ చట్టం సమానమని, చట్టానికి జాతి, కుల, మత, ధర్మ భేదాలు లేవని రాష్ట్రీయ హిందు ఫ్రంట్ ఒడిశా, కొరాపుట్ జిల్లా శాఖ ప్రతినిధులు అన్నారు. అందుచేత అన్ని వర్గాల కుటుంబాలకు ఇద్దరు బిడ్డల చట్టాన్ని తు.చ తప్పకుండా అమలు చేయాలని రాష్ట్రీయ హిందు ఫ్రంట్ డిమాండ్ చేసింది. రాష్ట్రీయ హిహిందు ఫ్రంట్ నేతలు జయపురం సబ్‌కలెక్టర్ కుమారి అక్కవరం శౌశ్య రెడ్డిని శనివారం కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహణ మఝి నుద్దేశించిన వినతి పత్రాన్ని అందజేశారు. చైనా వైశాల్యం 95.96 వేల చదరపు కిలోమీటర్లని భారత దేశం 32.87 వేల చదరపు కిలోమీటర్ల వైశాల్యమని వినతి పత్రంలో వెల్లడిస్తూ , చైనాతో పోల్చుకుంటే భారత్ వైశాల్యంలో చిన్నది అయినా జనాభాలో అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రతి రోజూ మన దేశంలో 65,797 మంది పిల్లలు జన్మిస్తున్నారని వెల్లడించారు.అంటే ప్రతి యేడాది 25 కోట్ల మంది కి పైగా జనసంఖ్య పెరుగుతున్నదని వివరించారు.జనాబాను నియంత్రించకపోతే 2050 నాటికి దేశ జనాబా 240 కోట్లను దాటుతుందని రాష్ట్రీయ హిందూ ఫ్రంట్ ప్రతినిధులు వినతి పత్రంలో వెల్లడించారు. ఆ సమయానికి దేశంలో కేవలం 80 కోట్ల మంది హిందువులు మాత్రం ఉంటారని వివరించారు. అందుచేత దేశంలో అన్నివర్గాల వారికి కుటుంబ నియంత్రణపై కఠిన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని వర్గాల వారు అధిక సంతానం కంటున్నారని, అటువంటి వారిని కఠినంగా దండించాలి అని డిమాండ్ చేశారు. ఎవరైనా మూడవ సంతానం కంటే వెంటనే అలాంటివారిని ప్రభుత్వ ఉద్యోగాల నుంచి తొలగించాలని, ఓటరు గుర్తింపు కార్డు రద్దు చేయాలని, ఎన్నికలలో పోటీ చేసే హక్కును రద్దు చేసే చట్టాన్ని తీసుకు రావాలని అలాగనే నలుగురిని కన్న వారికి జైలు శిక్ష విధించాలని డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రికి రాసిన వినతి పత్రాన్ని రాష్ట్రీయ హిందూ ఫ్రంట్ కొరాపుట్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర పాఢీ, ఉపాధ్యక్షులు మీనకేతన పారిచ, సీనియర్ న్యాయవాది మదన మోహణ నాయిక్, న్యాయవాదులు జ్యోతీ ప్రకాశ పూజారి, గిరిదర ఖొర,గుప్తేశ్వర బ్రహ్మ,మనమోహణ మిశ్ర,వల్లభ నారాయణ షాడంగి,సాహెబ్ మహరాణ,వరుణ జైన్,విజయ కుమార్ సాహు తదితరులు సబ్‌లక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

బాలికకు నిప్పంటించిన దుండగులు



బాధితురాలి పరిస్థితి వివరిస్తున్న గ్రామస్తులు

భువనేశ్వర్: పూరీ జిల్లా నిమ్మాపడా మండలం బయాబర్ గ్రామంలో అమానుష సంఘటన చోటు చేసుకుంది. 15 ఏళ్ల బాలికపై ముగ్గురు గుర్తు తెలియని దుండగులు దారుణంగా దాడి చేసి నిప్పంటించారు. ఈ దారుణం శనివారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో జరిగింది. స్నేహితురాలి ఇంటి నుంచి నడుచుకుంటూ తిరిగి వస్తుండగా గుర్తు తెలియని దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ సంఘటన ఆమె ఇంటి నుంచి 200 మీటర్ల దూరంలో జరిగింది. స్థానిక భార్గవి నది ఒడ్డున నిర్జన ప్రదేశంలో అడ్డగించి ఆమెపై పెట్రోల్ పోసి, నిప్పంటించి దుండగులు పారిపోయినట్లు గ్రామస్తుల సమాచారం.

మంటల్లో చిక్కుకున్న ఆమె అరుపులు విన్న గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరి మంటలను ఆర్పి పిప్పిలి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి ఉన్నత చికిత్స కోసం ఆమెను ఎయిమ్స్ భువనేశ్వర్‌కు తరలించారు. బాధితురాలి శరీరం 70 శాతం పైబడి కాలిపోయింది. తీవ్రంగా గాయపడిన బాలికను ఎయిమ్స్ ట్రామా సెంటర్ నుంచి బర్న్ వార్డుకు తరలించారు. బాధితురాలు పదే పదే స్పృహ కోల్పోతోంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి స్థిరంగా ఉందని ఎయిమ్స్ వైద్యులు సమాచారం. ఈ సంఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

గ్రామస్తుల వివరణ

మంటల్లో చిక్కుకున్న బాధితురాలి ఆర్తనాదంతో స్పందించిన గ్రామస్తులు తక్షణమే సహాయక చర్యలు చేపట్టారు. మంటలు నివారించి చేరువలో ఉన్న ఇంటికి తరలించి బట్టలు మార్చి చికిత్స కోసం స్థానిక పిప్పిలి ఆస్పత్రికి తరలించారు. ఆమె శరీరం సింహ భాగం కాలిపోయినట్లు గ్రామస్తులు గుర్తించారు. స్నేహితురాలికి పుస్తకం ఇచ్చి తిరిగి వస్తుండగా 3 మంది వ్యక్తులు బైక్ మీద వచ్చిన గుర్తు తెలియని ఈ దాడికి పాల్పడ్డారు. వీరంతా ముఖానికి రుమాలు చుట్టుకుని ఉన్నట్లు బాధితురాలు తెలియజేసినట్లు గ్రామస్తులు వివరించారు.

తదనంతర చర్యలు

మైనరు బాలికపై అమానుష దాడికి పాల్పడిన ఆగంతకుల్ని వెంటనే అరెస్టు చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ తెలిపారు.

ప్రత్యేక బృందాల గాలింపు

ఘాతుకానికి పాల్పడి ఘటనా స్థలం నుంచి పారిపోయిన వారిని గాలించి పట్టుకునేందుకు పూరీ జిల్లా పోలీసు యంత్రాంగం చురుకుగా స్పందించింది. 2 ప్రత్యేక పోలీసు బృందాలను గాలింపు చర్యల కోసం నియమించినట్లు పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పినాక్ మిశ్రా తెలిపారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉన్నందున ఆమె నుంచి సంఘటన పరమైన వివరాలు సంగ్రహించడం సాధ్యం కాలేదని ఎస్పీ విచారం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో దాడికి గల కారణం ముఖచిత్రం అస్పష్టంగా ఉందన్నారు. లైంగిక వేధింపుల ఫిర్యాదును పట్టించుకోకపోవడంతో బాలాసోర్‌లో 20 ఏళ్ల కళాశాల విద్యార్థిని ఆత్మాహుతితో మరణించిన సంఘటన ఆవేదన నుంచి రాష్ట్ర ప్రజానీకం కోలుకోక ముందే ఈ సంఘటన చోటు చేసుకోవడంపై సర్వత్రా విచారం వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ దుమారం తీవ్రమైంది. బాధితురాలు చికిత్స పొందుతున్న ఎయిమ్స్ ప్రాంగణం రాజకీయ వర్గాల తాకిడితో అట్టుడికి పోతుంది.

ఎయిమ్స్‌లో బాధితురాలి వాంగ్మూలం నమోదు

భువనేశ్వర్: స్థానిక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ఎయిమ్స్ ఆస్పత్రిలో పూరీ జిల్లా బలంగ ప్రాంతపు బాధితురాలి వాంగ్మూలం శనివారం నమోదు చేశారు. ఖుర్ధా అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఈ బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. బాలికకు మెరుగైన చికిత్స అందజేసేందుకు ప్రత్యేక వైద్య నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో వైద్య వివిధ విభాగాల నుంచి 14 మంది నిపుణులు ఉన్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా తెలియ జేశారు.

ఠాణాలో బాధిత బాలిక తల్లి ఫిర్యాదు



ఠాణాలో దాఖలు చేసిన ఫిర్యాదు

భువనేశ్వర్: దుండగులు నిప్పు అంటించిన సంఘటనలో బాధిత బాలిక తల్లి పూరీ జిల్లా నిమ్మాపడా బలంగా పోలీసు ఠాణాలో శనివారం ఫిర్యాదు చేశారు. ముగ్గురు గుర్తు తెలియని దుండగులు తన కుమార్తెను రుమాలుతో నోటికి కట్టేసి చెరువు గట్టు ప్రాంతానికి బలవంతంగా తీసుకుని వెళ్లి తీవ్ర అఘాయిత్యానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్మానుష్య చెరువు గట్టు ప్రాంతంలో కిరోసిన్, పెట్రోల్ పోసి నిప్పంటించారని తెలిపారు. ఘాతుకానికి పాల్పడిన దుండగులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె అభ్యర్థించారు.

విలేకరి హత్య కేసులో నిందితుల గుర్తింపు



మాట్లాడుతూన్న ఎస్పీ వినోద్ కుమార్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మోటు పోలీసు స్టేషన్ పరిధిలో ఓ విలేకరి హత్యకు గురైన సంగతి తెలిసిందే. వారం రోజుల్లోనే పోలీసులు నిందితులను గుర్తించారు. సుకుమార్ రాయి, జోన్ జోర్డాద్ అనే ఇద్దరు ఎంవీ 75, ఎంవీ 82 గ్రామాలకు చెందిన వారు వారు. వీరిద్దరూ విలేకరిపై దాడి చేశారని, హైదరాబాద్‌లో వీరిని పట్టుకున్నామని ఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- అటవీ ప్రాంతంలో శవమై తేలిన వైనం
- హత్యేనని కన్నవారి ఆరోపణ
- భర్తను అరెస్టు చేసిన పోలీసులు



సొమల జాని (ఫైల్)

జయపురం: వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితి ముర్తాహండి గ్రామ పంచాయతీ మాలచమాల్ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో మహిళ మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు తెలియజేశారు. వెంటనే వారు సంఘటనా ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలు మాలచమాల గ్రామం లచమన జాని భార్య సొమల జానిగా గుర్తించారు. దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు ఆమె భర్త లచమన జాని (30)ని కొట్‌పాడ్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లచమన్ తన భార్య సొమల జానితో గత ఆదివారం దిచక్ర వాహనంపై పంట పొలం చూసేందుకు వెళ్లారు. సొమల జాని బైక్ వద్ద నిలబడి ఉంది. అయితే లచమన తిరిగి వచ్చే సరికి ఆమె కనిపించలేదు. దీంతో భర్త భార్య ఆచూకీ కోసం స్థానికంగా గాలించాడు. అనంతరం తన మామయ్యకు కబురు చేశాడు. అనంతరం సొమల జాని కనిపించడం లేదని కొట్‌పాడ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో తన కుమార్తెను హత్య చేశారన్న అనుమానం వ్యక్తం చేస్తూ సొయల జాని తండ్రి సనసాయి దురువ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కుమార్తెను కొంతకాలంగా అల్లుడు లచమన వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సనసాయి దురువతో పాటు కొంతమంది గ్రామస్తులు పుట్టగొడుగుల కోసం గ్రామానికి సమీపంలోని అడవిలోకి వెళ్లగా వారికి కుళ్లిన వాసన రావడంతో అటుగా వెళ్లి చూడగా ఒకచోట మట్టిలో మహిళ మృతదేహం కప్పి ఉండటం కనిపించింది. వెంటనే వారు కొట్‌పాడ్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. కొరాపుట్ నుంచి సైంటిఫిక్ టీమ్‌ను రప్పించారు. బొరిగుమ్మ సబ్‌డివిజన్ పోలీసు అధికారి సత్యబ్రత లెంక, కొట్‌పాడ్ పోలీసు అధికారి పరమానంద సునాని తదితరుల సమక్షంలో మృతదేహాన్ని వెలికి తీశారు. లచమన జాని తన భార్యను హత్య చేశాడన్న అనుమానంతో అన్ని అరెస్టు చేశారు.

న్యూస్‌రీల్

నాగుపాముని మింగిన మందుబాబు



చికిత్స పొందుతున్న మందు బాబు

భువనేశ్వర్: బొలంగీర్ జిల్లా తెంతులిఖుంటి గ్రామంలో ఒక వింత సంఘటన చోటు చేసుకుంది. తాగిన మైకంలో ఓ వ్యక్తి బతికి ఉన్న నాగు పాముని కరకర నమిలి మింగేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతని పరిస్థితి విషమంగా ఉందని గుర్తించారు. సత్వర చికిత్స కోసం మందు బాబుని భీమా భొయ్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ వైద్యులు అతనికి చికిత్స కొనసాగిస్తున్నారు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉందని చికిత్స అందజేస్తున్న వైద్య వర్గాల సమాచారం. సజీవంగా ఉన్న పాముని ప్రత్యక్షంగా ముక్కలు ముక్కలు చేసుకుని మింగడంతో శరీరంలో విషం చేరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి ఖురిగా గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన వారిలో బొడొమత్రిబోట్ట గ్రామానికి చెందిన రంజిత్ కుమార్ నాయక్, బొర్జాఖాల్ గ్రామానికి చెందిన మహేంద్ర మాఝిలుగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న కాసీపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దార్యాప్తు చేస్తున్నారు.

విదేశీ మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితులతో పోలీసులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఉంద్రుకొండ పంచాయతీ సంగేల్ గ్రామంలో భారీగా విదేశీ మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో నలుగురిని అరెస్టు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. విధుల్లో భాగం గాశుక్రవారం రాత్రి కలిమెల ఐఐసీ ముకుందో మేల్కా తన సిబ్బందితో ఉంద్రుకొండ పంచాయతీ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అటుగా వస్తున్న బొలేరా వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 28 కేసుల్లో ఉన్న మద్యాన్ని గుర్తించారు. దీన్ని శనివారం ఉదయం తెరిచి చూడగా 235 లీటర్ల మద్యం (800)మిల్లీలీటర్ల బాటిళ్లను ఉన్నట్టు గుర్తించారు. కేసు నమోదు చేసి నిందితులు ఝార్కాండ్‌కు చెందిన అరవింద కుమార్, కందన్ కుమార్, అభిషేక్ కుమార్, బీహార్‌కు చెందిన నీరజ్ కుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఐఐసీ తెలిపారు. నిందితులంతా కలిమెలలోని ఓ మద్యం దుకాణంలో పనిచేస్తున్నారు.

ప్రపంచ శ్రేణి సౌకర్యాలతో రైల్వే స్టేషన్లు: రైల్వే శాఖ సహాయ మంత్రి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న

భువనేశ్వర్: దేశ వ్యాప్తంగా ఉన్న రైల్వే స్టేషన్లను ప్రపంచ శ్రేణి సౌకర్యాలతో అత్యాధునికంగా అభివృద్ధి చేస్తున్నట్లు రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్న తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను మంత్రి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 59 రైల్వే స్టేషన్లను రూ. 2,379 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం మంజూరు చేసిన వివిధ పనుల కింద రూ. 80,000 కోట్లకు పైబడిన వ్యయ ప్రణాళిక రైల్వే ప్రాజెక్టుల కార్యకలాపాలు చురుకుగా కొనసాగుతున్నాయి. గత ఏడాదిలో రాష్ట్రంలో 8 కొత్త రైల్వే ప్రాజెక్టులు, మల్టీట్రాకింగ్, ఫ్లైఓవర్ పనులకు రూ. 25,000 కోట్లు పైబడి నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. భువనేశ్వర్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పనుల్ని పురోగతిని సమీక్షించిన మంత్రి పనుల పురోగతి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

• ఎమ్మెల్యే ఔదార్యం



ఆస్పత్రిలో క్షతగాత్రుడుతో ఎమ్మెల్యే పవిత్ర శాంత

- క్షతగాత్రుడిని రక్షించిన వైనం



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్: ప్రమాదంలో ఉన్న వ్యక్తి గురించి ఎమ్మెల్యే సోషల్ మీడియాలో చూసి సంఘటనా స్థలానికి వెళ్లి రక్షించిన విషయం వెలుగులోనికి వచ్చింది. కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి 326పై బండికార్ ఘాట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మెటార్ సైకలిస్ట్ తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిఉన్నాడు. ఆ మార్గంలో వెళ్తున్న లక్ష్మీపూర్ సమితి కార్యాలయ ఉద్యోగి ఆశిష్ గర్దా ఆ దృశ్యాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేసి సహాయం కోరాడు. ఈ దృశ్యాన్ని సమీపం గ్రామంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత చూశారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని తన వాహనంలోనే లక్ష్మీపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొని వెళ్లి చేర్పించారు. క్షతగాత్రుడు అక్షయ్ హిక్కా తోయాపుట్ గ్రామ పంచాయితీ ఉస్కాబెటా గ్రామవాసిగా గుర్తించి వారి కుటుంబ సభ్యులను రప్పించారు. వారు వచ్చిన వెంటనే నగదు సహాయం అందించి అంబులెన్స్ ద్వారా కొరాపుట్‌లోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ ఆస్పతికి తరలించారు.

• వరద వెతలు



మధుపుర పంచాయితీ చైధురికుద్దొ గ్రామంలో మోకాలి లోతు నీటిలో అంతిమ యాత్ర

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బలియాపాల్ మండలం మధుపుర పంచాయతీ చెధురికుద్దొ గ్రామంలో హృదయం చలింపజేసే విచారకర సంఘటన తారస పడింది. అంత్యక్రియల కోసం మృత దేహాన్ని తరలించేందుకు గ్రామస్తులు మోకాలి లోతు నీటిలో 2 కిలోమీటర్లకు పైగా ఎదురీదాల్సి వచ్చింది. సువర్ణ రేఖ నది వరద ప్రజలను ఇలా వేధిస్తోంది. ఏటా సువర్ణ రేఖ నదికి వరదలు ముంచెత్తుతాయి. ఈ ఏడాది నది ఇప్పటికే 4 సార్లు వరదతో ఉప్పొంగింది. తాజాగా ముంచెత్తిన వరదల్లో బలియాపాల్ మండలం పరిధిలోని 6 పంచాయతీల్లో 30 పైబడి గ్రామాలు నీట మునిగాయి. సువర్ణ రేఖ నది వరదలతో ప్రజలు వర్ణనాతీతమైన ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు. మధుపుర పంచాయతీ చైధురికుద్దొ గ్రామానికి చెందిన మధు ప్రమాణిక్ (54) మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ మరణించాడు. గ్రామం, శ్మశానవాటిక వరద నీటిలో మునిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో మృతుని కుటుంబం పూరీ స్వర్గ్ ద్వార్‌లో అంత్యక్రియలు నిర్వహించేందుకు నిర్ణయించింది. మృతదేహాన్ని ఇంటి నుంచి గ్రామం ప్రధాన రహదారిపై నిలబడి ఉన్న స్వర్గ్ రథ్ (అంతిమ యాత్ర వాహనం) వరకు తీసుకెళ్లడానికి ముప్పుతిప్పలు పడాల్సి వచ్చింది. మృత దేహాన్ని తీసుకెళ్లడానికి మోకాలి లోతు వరద నీటిలో ఎదురీదుకుంటూ గ్రామస్తులు ఎంతో కష్టపడ్డారు. ఈ ప్రాంతంలో ప్రజలు వరద సమస్యలు నిరవధికంగా ఎదుర్కొంటున్న గ్రామస్తుల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకునే నాథుడు కొరవడినట్లు చైధురికుద్దొ గ్రామ నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతుకులు పూడ్చుతున్న యువకులు



326 జాతీయ రహదారి లో గతుకులను కప్పుతున్న యువకులు



వంతెనపై ఉన్న గాతలపై సిమ్మెంటు కాంక్రీట్ వేస్తున్న యువకులు

జయపురం: జయపురం సమితి పాత్రోపుట్ సమీప కొలాబ్ నదిపై గల వంతెన మార్గంలో అనేక గతుకులు ఏర్పడి ప్రజలు, వాహణ దారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. అలాగనే శ్రావణ మాసంలో ప్రఖ్యాత శివ క్షేత్రం గుప్తేశ్వర్‌కు వేలాది మంది భోల్‌భం కావిడి యాత్రికులు ఈ మార్గంలోనే వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. అలాగే 326 విజయవాడ-రాంచీ జాతీయ రహదారి అయిన ఈ మార్గంలోనే ప్రతి దినం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులు చూసిన కొంత మంది యువకులు రవీంద్ర నాయిక్ నేతృత్వంలో స్వచ్ఛందంగా సిమెంట్, కాంక్రీటుతో రోడ్డు గతుకులను కప్పుతున్నారు. గతుకుల రోడ్డు బాగు చేయాలని తాము ఎన్ని సార్లు అధికారులకు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదని పాత్రోపుట్ వాసులు ఆరోపించారు.నేడు యువకులు గతుకులు కప్పుతుండడం ఆనందంగా ఉందని అంటున్నారు.

చిత్రకొండ జలాశయంలో పడవ బోల్తా



జలాశయంలో గాలింపు చర్యలు చేపడుతున్న వాడ్రాఫ్ బృందం



రంగప్రవేశం చేస్తున్న వాడ్రాఫ్ బృందం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి జలాశయంలో డైక్-3 ప్రాంతంలో ఓ నాటు పడవ బోల్తా పడి ఒకరు గల్లంతయ్యారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. కోరుకొండ సమితి నక్కమమ్ముడి పంచాయతీ తాళపోధర్ గ్రామానికి చెందిన ఐదుగురు చేపల వేట కోసం వెళ్లారు. శుక్రవారం సాయంత్రం గాలికి పడవ బోల్తా పడింది. నలుగురు ఈదుకుంటూ ఒడ్డుకు రాగా.. ఒకరు రాలేకపోయారు. చిత్రకొండ వాడ్రాఫ్ బృందం గాలిస్తోంది. గల్లంతైన వ్యక్తి పేరు రామచంద్ర పాంగిగా గుర్తించారు.

క్లుప్తంగా

సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు


కిలారి నారాయణరావు

అరసవల్లి: జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారులుగా పదోన్నతులు కల్పిస్తూ జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా ఉత్తర్వులు జారీ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధికారిక ఆదేశాల ప్రకారం నిర్వహించిన ఈ పదోన్నతుల ప్రక్రియ అంతా పారదర్శకంగా జరిగింది. కాగా పాలకొండ ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రజనీకాంత్‌ను భామిని ఎంపీడీవో కార్యాలయ ఏఓగా, ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కిలారి నారాయణరావుకు కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయ ఏఓగా పదోన్నతి కల్పించారు. జిల్లా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కిలారి నారాయణరావుకు ఏవోగా పదోన్నతి లభించడంపై సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్, సీఈఓలకు నారాయణరావు ధన్యవాదాలు తెలియజేశారు.

పరిశుభ్రత పాటించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జేసీ

జలుమూరు : ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కరవంజలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం మోడల్ స్కూల్‌ను సందర్శించారు. మధ్యాహ్న భోజనం చేసి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు రేషన్ డిపో తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జెన్ని రామారావు, ఎంపీడీఓ కె.అప్పలనాయుడు, పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, ఎంఈఓలు మాధవరావు, ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అనిత

కొత్తూరు: విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్‌ఓ కె.అనిత అన్నారు. కొత్తూరు మండలం కారిగూడ గిరిజన గ్రామంలో మినీ గురుకులాన్ని శనివారం సందర్శించారు. విద్యార్థినుల ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. జ్వరం బాధపడుతున్న విద్యార్థినులను ప్రత్యేక గదిలో ఉంచి చికిత్స అందించాలని నిర్వాహకులకు సూచించారు. గిరిజన బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మెట్టూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబును ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాష్ట్ర ఫ్యాక్టరీల విభాగం డైరెక్టర్ చంద్రశేఖర్ వర్మ

రణస్థలం: పరిశ్రమలు పర్యావరణ పరిరక్షణ, కార్మిక భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని ఏపీ రాష్ట్ర ఫ్యాక్టరీల విభాగం డైరెక్టర్ డి.చంద్రశేఖర్ వర్మ అన్నారు. రణస్థలం మండలంలోని ఆపిటోరియా ఫార్మాలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలు, చిన్నారులకు భద్రతా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్ రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్ ఎస్.మదన్‌కుమార్, ఈహెచ్‌ఎస్ హెడ్ ఈ.సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లకు 30 రోజుల జైలుశిక్ష

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలోని ఒకటో పట్టణ పరిధి కామేశ్వరి కల్యాణ మండపం వెనక పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురికి న్యాయస్థానం 30 రోజుల పాటు జైలు శిక్ష విధించిందని ఎస్‌ఐ ఎం.హరికృష్ణ వెల్లడించారు. పట్టుబడిన బి.గోవింద (గోల్డ్ గోపి)పై 3 కేసులు, బి.ప్రసాద్‌పై 7, ఎం.మోహనకృష్ణపై రెండు కేసులు ఉన్నాయని వివరించారు. వీరిని శనివారం శ్రీకాకుళం స్పెషల్ జ్యుడీషియల్ సెకెండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివరామకృష్ణ ముందు హాజరుపర్చగా నేరం రుజువై జైలుశిక్ష విధించారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా జైలుకు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్రంలో శ్వేత విప్లవం


ముఖ్యమంత్రి సమక్షంలో కుదిరిన ఎన్‌డీడీబీతో ఓంఫెడ్ ఒప్పందం

• ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి


పాడి రైతు సంఘాలకు విరాళంగా అందజేసిన పాల ట్యాంకర్లు


ఓంఫెడ్ ప్లాంటులో పాల ప్యాకెట్ల యంత్రాల్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రంలో శ్వేత విప్లవానికి ఓంఫెడ్ వెన్నెముకని, రాష్ట్ర పాడి రైతుల స్వావలంబన బలోపేతం చేసే దిశలో పాల ఉత్పత్తిని పెంపొందించడంలో ఓంఫెడ్ ప్రధాన చోదక శక్తిగా ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. రానున్న రోజుల్లో పాల ఉత్పత్తిని పెంచేందుకు కామధేను పథకం ద్వారా రైతులకు అధిక దిగుబడినిచ్చే 10 వేల ఆవులను అందజేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. పాడి పశువుల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా రాష్ట్ర ఆవు ఆర్థిక వ్యవస్థను సుసంపన్నం చేస్తామన్నారు. శనివారం కటక్‌లో జాతీయ పాడి అభివృద్ధి బోర్డు, ఓంఫెడ్ మధ్య జరిగిన ఒప్పందం కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఓంఫెడ్ డెయిరీ ప్లాంట్ ఉద్యోగుల కోసం 62 క్వార్టర్లను, ప్లాంటులో పాల పొడి ప్యాకింగ్ యంత్రాలను ప్రారంభించారు. ఓంఫెడ్‌తో ఈ ఒప్పందం ద్వారా, జాతీయ పాడి అభివృద్ధి బోర్డు ఒడిశాలోని పాడి రైతులకు అధిక దిగుబడినిచ్చే గిర్, సాహివాల్, నాణ్యమైన సంకర జాతి జాతులకు చెందిన దాదాపు 3 నుంచి 4 వేల ఆవులను అందిస్తుంది. రాష్ట్రంలో గోబర్ గ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వివిధ పాల సంఘాలకు రూ.7.50 కోట్ల విలువైన 2,000 నుంచి 15,000 లీటర్ల సామర్థ్యం గల 22 పాల ట్యాంకర్లను విరాళంగా అందజేశారు. రూ. 3.5 కోట్ల వ్యయంతో నిర్మించిన 3 పాల ప్యాకింగ్ యంత్రాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ప్రస్తుతం రాష్ట్ర పాల ఉత్పత్తి 7.2 లక్షల లీటర్లు. 2036 నాటికి రాష్ట్ర పాల ఉత్పత్తి 16.5 లక్షల లీటర్లు. 2047 నాటికి ఈ పరిమాణాన్ని 17.5 లక్షల లీటర్లకు వృద్ధి చెందడం లక్ష్యంగా పాడి పశువుల పెంపకం, పాల ఉత్పాదన రంగాల్లో ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తుందన్నారు.

దేశంలో తలసరి పాల ఉత్పత్తి 471 గ్రాములని ముఖ్యమంత్రి అన్నారు. ఇది ప్రపంచంలో సగటు లభ్యత కంటే చాలా ఎక్కువ. పాల ఉత్పత్తిని పెంపొందించేందుకు కామధేను యోజన కింద రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 70 శాతం వరకు ఆర్థిక సహాయం అందజేసి ప్రోత్సహిస్తుంది. దీనివల్ల రాష్ట్రంలోని దాదాపు 15 లక్షల మంది గో సంరక్షకులకు ప్రయోజనం చేకూరుతుంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో, ఈ పథకం కింద 3 లక్షల మంది లబ్ధిదారులు రూ. 71 కోట్ల సహాయం పొందారు. ఆవుల రక్షణ, నిర్వహణ, చికిత్స కోసం రాష్ట్ర ప్రభుత్వం గోమాత యోజనను అమలు చేసింది. ముఖ్యమంత్రి ప్రాణి కళ్యాణ్ యోజన కింద కొత్త గో సంరక్షక శాలలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ చర్యలు రాష్ట్రంలో తలసరి పాల ఉత్పత్తిని పెంచుతాయని సీఎం అన్నారు.

ఓంఫెడ్ రూపొందించిన ప్రణాళిక ప్రకారం జాతీయ పాడి అభివృద్ధి బోర్డు సహకారంతో బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు అవుతుందని ప్రకటించారు. ఆవు పేడను బహుళ ప్రయోజనాలకు వినియోగించే దక్షతంతో ఈ ప్లాంటు పని చేస్తుందన్నారు. దీని వల్ల రాష్ట్ర గో ఆర్థిక వ్యవస్థ సుసంపన్నమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య, పశువుల పెంపకశాఖ మంత్రి గోకులానంద మల్లిక్, కటక్ లోక్ సభ సభ్యుడు డాక్టర్ భర్తృహరి మహతాబ్, ఓంఫెడ్ అధ్యక్షుడు కిశోర్ చంద్ర ప్రధాని, మత్స్య, పశువుల అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ వశిష్ట్, ఎన్‌డీడీబీ డెయిరీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ దేవానంద, ఓంఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ అమృత్ కులంగే, ఓంఫెడ్ పాలక మండలి సభ్యులు, వివిధ పాల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం


కాశీనగర్‌లో పీఎం ఆవాస్ యోజనా వర్క్ఆర్డర్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంపీ ప్రదీప్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్‌లో బరంపురం ఎంపీ ప్రదీప్ పాణిగ్రాహి శనివారం పర్యటించారు. పర్లాకిమిడి సర్క్యూట్ హౌస్‌కు చేరుకున్న ఎంపీని బీజేపీ సీనియర్ నాయకులు ఛిత్రి సింహాద్రి, దారపు రాజేష్ కుమార్ స్వాగతం పలికారు. కాశీనగర్ సమితి కె.సీతాపురం పంచాయతీలో గల తరల గ్రామంలో పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం ఖరడ పంచాయతీలో డి.జయపురంలో అంగన్‌వాడీ నూతన భవనం, శియ్యాలీ పంచాయతీలో ఎస్‌బీఐ బ్యాంకింగ్ సేవల భవనాలను ప్రారంభించారు. అనంతరం కాశీనగర్ నగరపాలక సంస్థ వద్ద త్రినాథి మండపంలో జరిగిన సమావేశంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం లబ్ధిదారులకు వర్క్ ఆర్డర్లను ఎంపీ ప్రారంభించారు. ఈ సమావేశంలో కాశీనగర్ నగర పాలక సంస్థ చైర్మన్ మేడిబోయిన సుధారాణి, కాశీనగర్ బీజేపీ అధ్యక్షుడు వి.చలపతి రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నళినీకాంత పాత్రో, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శంకర్ కెరకెటా, కాశీనగర్ ఎస్.ఏ.సి.ఈ.ఓ. భాగవత్ సాహు, బీడీఓ డంబుధర మల్లిక్ తదితరులు పాల్గొన్నారు. కాశీనగర్‌లో సాధరణ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై స్థానికులు ఎంపీకి వినతులు అందజేశారు. అనంతరం కాశీనగర్ పీహెచ్‌సీని ఎంపీ తనిఖీ చేసి అక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు. కొంతమంది న్యాయవాదులు పర్లాకిమిడిలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎంపీని కోరారు. గజపతి జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటుపై రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ మఝి దృష్టికి తీసుకువచ్చి బీజేపీ ప్రభుత్వ హయంలో శంకుస్థాపన చేస్తామని ఎంపీ తెలియజేశారు.

బాలియాత్రకు విరాళాలు వద్దు

జలుమూరు: శ్రీముఖలింగంలో నవంబరులో కార్తిక పౌర్ణమి అనంతరం నిర్వహించనున్న బాలియాత్రకు భక్తులు, దాతల నుంచి ఎటువంటి విరాళాలు స్వీకరించడం లేదని నిర్వహణ కమిటీ సభ్యుడు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించేందుకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించగా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. యాత్ర నిర్వహణకు సాయం చేయదలచుకుంటే భక్తులకు తాగునీరు, మజ్జిగ, టెంట్లు, విద్యుత్ అలంకరణ, స్నానాల ఘాట్‌లు శుభపరచడం వంటివి చేయవచ్చని తెలిపారు. బాలియాత్ర ఒక కులానికి సంబంధించినది కాదని, కళింగ రాజ్యానికి చెందినదని స్పష్టం చేశారు. కుల, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలు సహకరించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

మందస: మండలంలోని కొత్త కమలాపురం, బాలిగాం సమీపంలో పొలాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని రైతులు బొంగి వెంకయ్య, బొంగి సీతారాం, భావన సాంబమూర్తి, సేపాన నారాయణ, కోండియా నారాయణస్వామి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ దుండగులు రాత్రివేళల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తూ లోపలున్న రాగిని అమ్ముకుంటున్నారని చెప్పారు. విషయాన్ని విద్యుత్ శాఖాధికారి ఎల్.యోగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు.

పాఠశాల పునర్నిర్మాణం చరిత్రాత్మకం


వేడుకల్లో పాల్గొన్న అతిథులు

మందస : మందసలో 125 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ రాజా శ్రీనివాస స్మారక ఉన్నత పాఠశాల పునఃప్రారంభ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ చారిత్రక పాఠశాల భవనం పునఃప్రారంభం కావడం, అందులో భాగస్వామ్యం అవ్వడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. డీఈఓ తిరుమల చైతన్య మాట్లాడుతూ ఆనాటి మహారాజులు నిర్మించిన భవనాన్ని నేటి మా రాజులైన పూర్వ విద్యార్థులు పునర్నిర్మించి చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించారని కొనియాడారు. అనంతరం అతిథులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సుమారు 16 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరగనుంది.

రాజధానిలో రగులుతున్న ఆందోళనలు


ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా నివాసం ముట్టడికి ఉద్యమిస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకులు

భువనేశ్వర్: పూరీ జిల్లా నిమ్మాపడా ప్రాంతంలో బాలికక నిప్పు అంటించిన సంఘటన పురస్కరించుకుని రాజధాని నగరంలో ఆందోళనలు రగులుతున్నాయి. ఈ ప్రాంతం ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా నియోజక వర్గం కావడంతో ఆముకు భద్రతా ఏర్పాట్లు పెంచారు. శనివారం సాయంత్రం నుంచి స్థానిక రాజ్ భవన్ కూడలి నుంచి ఏజీ చౌరస్తా వరకు ఉన్న రహదారిని సీల్ చేశారు. ఈ ప్రాంతంలో భద్రత కోసం 6 ప్లటూన్ల అదనపు పోలీసు బలగాలను మోహరించారు. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల కంచె, కట్టెలతో తాత్కాలిక బారికేడ్లు ఏర్పాటు చేసి ఆందోళనకారుల చొరబాటు నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా శాంతిభద్రతల విభాగం స్పందించింది.

ఉప ముఖ్యమంత్రి ఇంటి ముందు నిరసన

రాష్ట్ర యువజన, విద్యార్థి కాంగ్రెస్ సభ్యులు ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ఇంటి ముందు నడి రోడ్డు మీద బైఠాయించి నిరసన ప్రదర్శించారు. మరో వైపు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి బాహినీపతి నేతృత్వంలో మహిళా కార్యకర్తలు బారికేడ్‌ను అధిగమించి ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా నివాసంపై దాడికి పాల్పడి టొమాటోలు రువ్వి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు రంగంలోకి ఆందోళనకారుల్ని చెదరగొట్టారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి బాహిణీపతి ఎయిమ్స్‌లో బాధితురాలి కుటుంబాన్ని కలిశారు. వైద్య, చికిత్స వ్యవస్థని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వం మహిళలను రక్షించలేకపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయం ఆవరణలో బిజూ మహిళా జనతా దళ్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు.


ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ఇంటి ఆవరణలో బైఠాయించి నిరసన ప్రదర్శిస్తున్న రాష్ట్ర యువజన, విద్యార్థి కాంగ్రెస్ కార్యకర్తలు


రాష్ట్ర మహిళా కమిషను కార్యాలయం ఆవరణలో బీజేడీ మహిళ నాయకుల ఆందోళన

జర్నలిస్టుల డిమాండ్లను పరిష్కరించాలి


పవర్‌లిఫ్టింగ్‌లో జాతీయ స్థాయిలో పలు బంగారు పతకాలు సాధించిన బిశ్వనాథ్, అతని కుమార్తె వైభవీ

జయపురం: జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను శాసన సభ శీతాకాల సమావేశాల నాటికి పరిష్కరించాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అప్సరా సభావేదికలో జరిగిన ఉత్కళ సంబాదిక సంఘం (ఒడిశా జర్నలిస్టు అసోసియేషన్)వార్షికోత్సవంలో ముఖ్యఅతిగా పాల్గొన్నారు. ప్రజాస్వామ్యంలో నాల్గో స్తంభమైన జర్నలిస్టులు సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారని కొనియాడారు. రానున్న విధానసభ సమావేశాల్లో జర్నలిస్టు సమస్యలు వారి డిమాండ్లను తాను ప్రస్తావిస్తానని జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు జీవిత బీమా రూ.10 లక్షలకు చేయాలని, పెన్షన్ రూ.5 లక్షలు చెల్లించాలని తాను ఎంతో కాలంగా విధాన సభలో డిమాండ్ చేస్తూనే ఉన్నానని వెల్లడించారు. ఈ సమావేశంలో వివిధ రంగాలలో ప్రశంసనీయ ప్రతిభను ప్రదర్శిస్తున్న ఐదుగురుని ఉల్కళ సంబాదిక సంఘం తరఫున ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో పవర్ లిఫ్టింగ్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బంగారు పథకాలు సాధించిన బిశ్వనాథ్ నాయక్, ఆయన కుమార్తె వైభవీ నాయక్‌ను, స్వచ్ఛంద రక్తదాత సుభాష్ షరాబ్, సీనియర్ పాత్రికేయులు చిత్తరంజన్ చౌదరి, దేవీ ప్రసాద్ మహంతి సన్మానించారు. 9 మంది జర్నలిస్టులకు రూ.5 లక్షల చొప్పున బీమా చేయించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఉత్కళ సంబాదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిభుతి భూషణ కర్.. కొరాపుట్ జిల్లా సంఘ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మూడేళ్లకు ప్రకటించిన నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా కె.శ్రీనివాస రావు, కార్యదర్శిగా నృసింహ బ్రహ్మ, ఉపాధ్యక్షులుగా పింటు ప్రధాన్, మనోజ్ దాస్, ఆనంద ఖొర, త్రినాథ్ ఖొర, సహాయ కార్యదర్శిగా శుభ నారాయణ మహంతి, రామచంద్ర నాయక్, కోశాధి కారిగా మధుసూదన పాత్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చైతన్య హంతాల్, సంక్షేమ నిధి చైర్మన్‌గా ఎస్.సుందరం, సంఘ సలహాదారునిగా బినోద్ మహాపాత్రో, మల్కనగిరి జిల్లా అధ్యక్షుడిగా అశోక్ కుమార్ మిశ్ర, నవరంగపూర్ అధ్యక్షుడిగా పి.ప్రకాశ్‌ను నియమించారు.

హోంగార్డు అభ్యర్థుల నిరసన


రాణిపేట డీపీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న హోంగార్డు అభ్యర్థులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాణిపేట డీపీఓ కార్యాలయానికి దక్షిణమండళం (బరంపురం) ఐజీ నీతిశేఖర్ శనివారం సందర్శించారు. ఇటీవల హోంగార్డులు పోస్టుల నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ కోందరు అభ్యర్థులు రాణిపేట ఎస్పీ కార్యాలయం వద్దకు విచ్చేసి నిరసన చేశారు. ఈ విషయం దక్షిణ మండళం ఐజీ దృష్టికి తీసుకువెళ్లాలని అభ్యర్థులు కోరగా అందుకు పోలీసు విభాగం నిరాకరించగా.. అక్కడ హోంగార్డు అభ్యర్థులు పోలీసుల మధ్య ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. హోంగార్డుల అభ్యర్థుల ఎంపిక సమయంలో ఇద్దరు అభ్యర్థులు పరుగుపందెం పరీక్షలో మృతి చెందారు. ఇప్పటివరకు హోంగార్డు పోస్టుల ఎంపిక జాబితాను అధికారులు విడుదల చేయలేదు. చాలా సమయం వరకు ఐజీ నితి శేఖర్ బయటకు రాకపోవడంతో అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తర్వాత ఐజీ బయటకు వచ్చి.. అభ్యర్థుల అభియోగాలు విని దీనిపై దర్యాప్తు ప్రారంభిస్తామన్నారు. హోంగార్డు పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను త్వరలోనే ప్రకటిస్తామని చెప్పి వెళ్లిపోయారు.

వినాయక చవితి నిర్వహణకు తీర్మానం


సమావేశంలో పాల్గొన్న రేజేటి, భళ్లమూడి, ఆచార్యులు

రాయగడ: బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తీర్మానించారు. ఈ మేరకు స్థానిక బాలాజీ నగర్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశం నిర్వహించారు. సమాజం అధ్యక్షులు రేజేటి శ్రీనివాస్ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భాగంగా సమాజంలో వివిధ సేవలను అందిస్తున్న సీనియర్ సభ్యులను ఈ సందర్భంగా సత్కరించేందుకు నిర్ణయించారు. సమాజం కార్యదర్శి భళ్లమూడి నాగరాజు, కళ్యాణవేంకటేశ్వర మందిరం ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, టి.ఎస్.ఆర్.మూర్తి , అవసరాల నారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి వరిసాగు లాభదాయకం


యంత్రాలతో విత్తనాలు, ఎరువులు వేస్తున్న వ్యవసాయాధికారులు

రణస్థలం: మారిన వాతావరణ పరిస్థితులలో తక్కువ నీటితో లాభదాయక దిగుబడులు పొందడం ఆరుతడి వరిసాగు విధానం ద్వారే సాధ్యమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. శనివారం రణస్థలం మండలం వెంకటరావుపేటలో యంత్రం ద్వారా విత్తనం, ఎరువు ఒకేసారి వేసే విధానంపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాధార భూములు, తక్కువ నీటి వనరులున్న పొలాలకు ఈ విధానం అనుకూలంగా ఉంటుందన్నారు. డ్రమ్ సీడింగ్ యంత్రాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. దీనివల్ల ఎకరాకు 15 నుంచి 16 కేజీల విత్తనం సరిపోతుందన్నారు. నారుమడి పెంపకం, నాట్లు అయ్యే ఖర్చు తగ్గడమే కాక పంట కూడా సుమారు వారం రోజులు ముందే కోతకు వస్తుందని చెప్పారు. వరుస విధానం వల్ల పురుగులు, తెగుళ్ల సమస్య తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.విజయభాస్కర్, ఏఈఓ వై.రాజశేఖర్, వీఏఏ సంధ్య, ప్రాంతీయ మేనేజర్ పి.తవిటినాయుడు, సమన్వయకర్తలు ఎస్.పి.నారాయణరావు, పి.రమణ, గ్రామ వ్యవసాయ సహాయకులు, లీడ్ ఫార్మర్లు కె.రాము తదితరులు పాల్గొన్నారు.

గోపి కుటుంబ సభ్యులకు తమ్మినేని పరామర్శ


సత్తారు గోపి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

రణస్థలం: ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో సత్తారు గోపి ఇటీవల హత్యకు గురైన నేపథ్యంలో కుటుంబ సభ్యులను మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు తమ్మినేని సీతారాం శనివారం పరామర్శించారు. గోపి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ కళింగ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, నాయకులు పప్పల రమేష్, బొడ్డేపల్లి నారాయణమూర్తి, ఎర్రంనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదు టన్నుల పశుమాంసం పట్టివేత


కంటైనర్‌లో ఉన్న పశుమాంసం

మందస: మదనాపురం–భిన్నాళి సమీపంలో జాతీయ రహదారిపై పశుమాంసం తరలిస్తున్న కంటైనర్ లారీని పోలీసులు పట్టుకున్నారు. కోల్‌కతా నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఈ వాహనంలో సమారు 5 టన్నులు పశుమాంసం ఉందని మందస ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. డ్రైవర్ రాజమండ్రి చెందిన వెంకన్నగా గుర్తించామని చెప్పారు. పూర్తిగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

క్లుప్తంగా

సారా స్థావరాలపై పోలీసుల దాడులు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

వంగర: మండల పరిధి వి.వి.ఆర్.పేట గ్రామ సమీపంలో సారా స్థావరాలపై శనివారం పోలీసులు దాడులు చేశారు. ఎస్‌ఐ షేక్ శంకర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది నాగావళి పరివాహక ప్రాంతంలో గాలించారు. ఓ ప్రదేశంలో 1500 పులిసిన బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. అనంతరం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సారా తయారీ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రెండు బైక్‌లు ఢీకొని నలుగురికి గాయాలు



గాయాల పాలైన యువకులు

మక్కువ: మక్కువ – చినబోగిలి రహదారి మధ్య ములక్కాయవలస గ్రామ సమీపంలో శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు యువకులు గాయాల పాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం వెంకటభైరిపురం గ్రామానికి చెందిన గంటసాగర్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై మక్కువ వస్తుండగా, మక్కువ నుంచి ములక్కాయవలస గ్రామం మీదుగా మక్కువకు చెందిన చోడవరపు జశ్వంత్, కాతా తనూజ్, చెముడు గ్రామానికి చెందిన వి.విష్ణు బైక్‌పై వస్తున్నారు. ఎదురెదురుగా వచ్చిన రెండు వాహనాలు ఢీకొనడంతో నలుగురూ గాయాల పాలయ్యారు. వెంటనే స్థానికులు వీరిని మక్కువ పీహెచ్‌సీకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం, మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

భోగాపురం: భోగాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గల జాతీయ రహదారి 16పై శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎరుపు రంగు షర్ట్ వేసుకున్న ఈ వ్యక్తి సమాచారం తెలిస్తే 9121109445 నంబరును సంప్రదించాలని ఎస్‌ఐ ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు.

లోయలో పడిపోయిన ట్రాక్టర్ ఇంజిన్



లోయలో పడిపోయిన ట్రాక్టర్ ఇంజిన్

సాలూరు: మండలంలోని గిరిశిఖర సంపంగిపాడు పంచాయతీ సుల్లారి నుంచి దిగువరూఢి మధ్య మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి లోయలో పడిపోయింది. పట్టణం నుంచి యూరియా కొనుగోలు చేసుకుని జీపులో కురుకుటి వరకు తీసుకువచ్చారు. అక్కడ నుంచి ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని వెళ్తుండగా, దిగువ రూఢి మలుపు వద్ద ఆపాడు. ఇటీవల వర్షాలు పడుతుండడం మలుపు ప్రమాదకరమని ముందుగానే గుర్తించి, వారు లోడును అక్కడ నిలిపేశాడు. ట్రాక్టర్ ఇంజిన్‌ను ముందుకు వెనక్కి తీసి లోడుతో ట్రాక్టర్ వెళ్లేందుకు అనువుగా చేసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ ఇంజిన్ అదుపు తప్పడాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై గెంతేయడంతో ప్రమాదం తప్పి డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. కాగా వాహనం సుమారు 200అడుగుల లోతులో పడిపోయింది.

ఏడుగురికి రూ.70వేల జరిమానా

పార్వతీపురం రూరల్: మద్యం సేవించి వాహనాలను నడిపినందుకుగాను ఏడుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ. 70వేలు జరిమానాను పార్వతీపురం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విధించినట్టు పట్టణ సీఐ కె.మురళీధర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండోసారి మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే మూడు నెలల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

400 మందికి వైద్య పరీక్షలు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి మోడల్ పాఠశాలలో 400 మంది విద్యార్థులకు కె.కొత్తవలస పీహెచ్‌సీ సిబ్బంది శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ ఈశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత గోడు పట్టదా..!

- సంగాంలో అన్నదాతకు తీవ్రనష్టం
- పూడుకుపోయిన తంపర బట్టి
- పంట పొలాల్లోకి వరద నీరు
- నీట మునిగిన పంట పొలాలు
- ఏటా ఇదే దుస్థితి
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు
- 300 ఎకరాల్లో వరద నీరు పోటు



సమస్య పరిష్కరించాలంటున్న రైతులు

వంగర: మండల పరిధి సంగాంలో అన్నదాతకు తీరని నష్టం జరుగుతుంది. వర్షం నీరు.. వరద నీరు మళ్లించేందుకు ఏర్పాటు చేసిన తంపర బట్టి పూర్తిగా పూడుకుపోవడంతో ఆ నీరు పంట పొలాల్లోకి వెళ్లిపోతుంది. దీంతో పంట పొలాల్లో నీరు నిలువ ఉండడంతో 300 ఎకరాలు మేర పంటకు ఏటా నష్టం జరుగుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. తంపర భూములు చుట్టూ ఇక్కడ ఉన్న చేపల చెరువు యజమాని గట్టు కట్టేయడంతో ఈ సమస్య మరింత జటిలమైంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటూ సంగాం, మగ్గూరు గ్రామాలకు చెందిన రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది.

ఇదీ సమస్య..

సంగాం, మగ్గూరు గ్రామాలకు చెందిన కడుమల పొలం, షావుకారి పొలం, బోరుమడులు, బదంతాలు పొలంతో పాటు మరిన్ని పంట పొలాలు ఏటా నీట మునుగుతున్నాయి. సంగాంకు చెందిన 250 ఎకరాలు, మగ్గూరుకు చెందిన 50 ఎకరాలు తంపర బట్టి సమీపంలో పంట పొలాలున్నాయి. ఈ తంపర బట్టి ఎగువ భాగంలో 16 ఎకరాల తంపర పొలాలున్నాయి. ఈ పొలాల్లో చేరిన వరద నీరు తంపర పొలాల నుంచి తంపర బట్టిలోకి వెళ్లి నేరుగా సంగాం గ్రామ సమీపంలో ఉన్న నాగావళి నదిలోకి ప్రవేశిస్తుంది. అయితే తంపర బట్టి పూర్తిగా పూడుకుపోవడంతో చేపలు చెరువుల్లోని నీరు, తంపర పొలాల్లోని నీరు పంట పొలాల్లోకి చొరబడుతుంది. దీంతో ఈ సమస్య నెలకొంది.



పూడుకుపోయిన తంపరబట్టిని చూపుతున్న రైతులు



నీటిలో మునిగిన వరి పంట

ప్రభుత్వం.. అధికారుల నిర్లక్ష్యం

గడిచిన కొన్నేళ్లుగా తంపర బట్టి పొలాలపై ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. తంపర బట్టిలో పూడిక తీత పనులు చేపడితే కొంత నష్ట నివారణ జరుగుతుందని, అదే విధంగా ఇరిగేషన్ అధికారులు కూడా ఇక్కడ పనులు చేపట్టకపోవడం ఈ పరిస్థితి నెలకొంది. అలాగే 14 మీటర్లు వెడల్పు ఉన్న తంపర బట్టి కేవలం నాలుగు మీటర్లకు కుదించిపోవడంతో వృథా నీరు, వరద నీరు వెలుపలికి తరలించే పరిస్థితి లేదు. చేపలు చెరువు యజమాని ఏటా రెండుసార్లు తంపరబట్టిలో పూడిక తీస్తామని హామీ ఇచ్చినా ఎన్నడూ పట్టించుకోలేదని ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. తంపరబట్టికి ఇరువైపుల ఉన్న సంగాం, మగ్గూరుకు చెందిన 300 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుతం రైతులు ఉబాలు వేసిన నాట్లు నీటిలోనే ఉన్నాయి.

ఏటా పంటకు తీవ్ర నష్టం



తంపర బట్టి పూర్తిగా పూడుకుపోయింది. 14 మీటర్లు వెడల్పు ఉన్న కాలువ నాలుగు మీటర్లకు కుదించుకుపోయింది. ఎగువ ప్రాంతంలో ఉన్న తంపర భూముల నీరు, చేపలు చెరువుల్లో ఉన్న నీరు ఒక్కసారిగా పంట పొలాల్లోకి వచ్చి నిల్వ ఉండడంతో పంట నాశనం అవుతోంది.

– బోను ఆనందరావు, రైతు, సంగాం

కలెక్టర్ ఫిర్యాదు చేసినా...



తంపర బట్టి సమస్యను కలెక్టర్ ఫిర్యాదు చేసినా అధికారుల్లో స్పందన లేదు. బట్టి పూర్తిగా పూడుకుపోవడంతో తమ పొలాల మీదుగా నీరు ప్రవహిస్తుంది. లోతట్టు పొలాల్లో నీరు నిలువ ఉండడంతో పంటలు నాశనమవుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పంటలు నీట మునిగిపోతున్నాయి. అన్నదాతలు ఎలా బతకాలి.

– కాంబోతుల సింహాచలం, రైతు, సంగాం

తక్షణమే పనులు చేయాలి



తంపర బట్టిలో తక్షణమే పనులు చేపట్టాలి. నీటి పారుదల శాఖ, ఉపాధి హామీ పథకం ద్వారా తక్షణమే పనులు చేపట్టి పూర్తి స్థాయిలో మట్టిని తొలగించి బట్టిని వెడల్పు చేపట్టాలి. లేకపోతే భవిష్యత్‌లో ఒక్క ఎకరా కూడా సాగు చేయలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించాలి.

– కాంబోతుల రాంబాబు, రైతు, సంగాం.

ఎస్పీ కార్యాలయంలో డీఐజీ తనిఖీలు



ఎస్పీ కార్యాలయంలో పోలీసు శాఖ అధికారులతో మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

పార్వతీపురం రూరల్: వార్షిక తనిఖీల్లో భాగంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో ఉన్న పలు ప్రధాన విభాగాలను శనివారం తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో జిల్లా పోలీసు శాఖ కార్యాలయానికి వచ్చిన ఆయనకు ముందుగా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం డీసీఆర్‌బీ, స్పెషల్ బ్రాంచ్, పాస్‌పోర్టు విభాగాలను ఆయన సందర్శించి రికార్డులు నిర్వహణను ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డితో కలసి క్షుణ్ణంగా పరిశీలించారు. వివిధ సెక్షన్లు, వివిధ రకాలుగా నిర్వర్తించే అధికారులు, సిబ్బంది, వారి విధులు వంటి అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సోషల్ మీడియా, సైబర్ సెల్ విభాగాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది అందరినీ ప్రశ్నించి వారు రోజువారీ కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష నిర్వహించిన డీఐజీ గోపీనాథ్ జట్టి నిర్వహణ, పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. వార్షిక తనిఖీల్లో ఎస్పీతో పాటు ఏఎస్పీ అంకితా సురాన, పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల ఫిర్యాదులపై విచారణ

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిందాల్ సేకరణలో నిర్వాసితులైన లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా చూస్తామని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ ఛాంబర్‌లో చీడిపాలెం, ముషిడిపల్లి, చినఖండేపల్లి, కిల్లంపాలెం, మూల బొడ్డవర గ్రామాలకు చెందిన 10 మంది రైతులు తమకు జిందాల్ భూములకు సంబంధించి ఇంతవరకు నష్టపరిహారం అందలేదని శనివారం ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన దస్త్రాలు కలెక్టర్‌కు చూపించి వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ మురళిని విచారణాధికారిగా నియమిస్తూ నిజనిర్ధారణ చేసి పూర్తి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. నివేదిక ప్రకారం తగిన చర్యలు తీసకోవడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మురళి, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారు తొలగించొద్దు..
రైతు బతుకు బుగ్గిపాలు చేయొద్దు

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



రైతుబజార్‌ను కొనసాగించాలని కోరుతూ సంతకాల ఉద్యమం చేపడుతున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

విజయనగరం గంటస్తంభం: పాత మహారాజ ఆస్పత్రి వద్ద ఉన్న రైతుబజారును తొలగించవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. అదే రైతుబజారు వద్ద విజయనగరం పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రైతుబజార్‌ను ఆస్పత్రి వద్దే కొనసాగించాలనే దానికి మద్దతు కూడగడుతూ సంతకాల సేకరణ శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని, రైతులతో కలిసి రైతుబజార్‌ను కాపాడుకుంటామన్నారు. 1999 నుంచి రైతుబజారు అక్కడే ఉందని, అప్పటి నుంచి 50 కుటుంబాల వారు అదే బజారుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. నగర ప్రజలకు అన్ని విధాలా అందుబాటులో ఉన్న ఈ స్థలం ఎమ్మెల్యే అదితిగజపతి, అశోక్ గజపతి రాజులు ఇన్నాళ్లు ఊరుకుని ఇప్పుడు ఆ స్థలం తమదని అప్పగించాలని అనడం సరికాదన్నారు. విద్యాదాతలు, భూ దాతలు అని చెప్పుకునే వారే ఇలా చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అద్దెలు కట్టుకుని, పన్నులు చెల్లించుకుని మరీ కూరగాయలు అమ్ముకుని జీవనం సాగిస్తున్న వారిని తీసేయడమనేది వారి పొట్టకొట్టడమేనన్నారు. ప్రస్తుతం అక్కడ భూమి ఖరీదైనది కాబట్టి ఆ భూమిని లాగేసుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గం తప్ప మరొకటి కాదన్నారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వానికి అద్దెలు చెల్లించి రైతుబజారులో కూరగాయలు అమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతు కుటుంబాలను రోడ్డున పడేస్తే ఎలా అని, వారి తరఫున పోరాడుతామన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం బాధ్యత తీసుకుని, రైతుబజారును అక్కడే ఉంచేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రామ్‌జీ చాంబర్ ఆఫ్ కామర్స్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు టి.వి.రమణ, అంగన్‌వాడీ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ, అధ్యక్షుడు జగన్మోహన్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

భర్తపై భార్య ఫిర్యాదు

విజయనగరం క్రైమ్ : విజయనగరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదైంది. మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ గోవిందరావు ఆదేశాలతో ఎస్‌ఐ శిరీష భార్య ఇచ్చిన ఫిర్యాదుతో భర్తపై కేసు కట్టారు. వివరాల్లోకి వెళ్తే.. చెల్లూరుకు చెందిన మధుబాబు, సత్యవతికి 2012లో వివాహమైంది. పెళ్లి సమయంలో మధుబాబు కోరినంత రూ.2లక్షల కట్నం, మూడు సవర్ల బంగారం కానుకగా ఇచ్చారు. అయినా సత్యవతికి అత్తారింట్లో వేధింపులు మొదలయ్యాయి. అత్త, మామతో పాటు భర్త మధుబాబు కూడా సత్యవతిని కట్నకానుకల కోసం వేధించసాగాడు. ఈ బాధలు భరించలేక సత్యవతి మహిళా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. ఎస్‌ఐ శిరీష కేసు నమోదు చేసి మధుబాబును అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టారు.

నవీన్‌పై పీడీ యాక్టు

విజయనగరం క్రైమ్ : చట్టాన్ని తరచూ ఉల్లంఘిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న రాజాం మండలం గురువాంకు చెందిన కుప్పిలి నవీన్(19)పై పీడీ యాక్టు ప్రయోగించి, ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా నవీన్‌ను విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్పీ వకుల్ జిందల్ శనివారం తెలిపారు. నవీన్ చెడు వ్యసనాలకు అలవాటు పడి, దురుసుగా ప్రవర్తిస్తూ ఇతరులకు హాని కలిగించే విధంగా మారాడని ఎస్పీ పేర్కొన్నారు. చిన్న చిన్న విషయాలకే తగదా పడుతూ.. భౌతిక దాడులకు పాల్పడుతూ గత ఐదేళ్లలో రాజాం పోలీస్‌స్టేషన్‌లో నాలుగు, సంతకవిటి పోలీస్‌స్టేషన్‌లో ఎనిమిది కేసుల్లో నిందితుడిగా అరెస్టు అయ్యాడని వెల్లడించారు. నేరాల నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న ముందస్తు చర్యల్లో భాగంగా నవీన్‌పై పీడీ యాక్టు అమలు చేయాలని కోరుతూ రాజాం పోలీసులు జిల్లా పోలీసు కార్యాలయానికి ప్రతిపాదనలు పంపారని తెలిపారు. వాటిని సిఫారసు చేస్తూ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ మేరకు నవీన్‌ను నిర్బంధించి విశాఖ పట్నం సెంట్రల్ జైలుకు తరలించామని ఎస్పీ తెలిపారు.

బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలే లక్ష్యం

సాక్షి, పార్వతీపురం మన్యం: ప్రతి గ్రామం బహిరంగ మలవిసర్జన రహితం (ఓడీఎఫ్ ప్లస్) కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై శనివారం కలెక్టరేట్ నుంచి జిల్లా, మండలాధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని, ఓడీఎఫ్ ప్లస్‌కు గ్రామస్తులంతా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో హేమలత, డిప్యూటీ కలెక్టర్ దిలీప్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలి



పెదబొండపల్లిలో చెత్త సేకరణ కేంద్రంలో వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి నారాయణ భరత్‌గుప్తా, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

- జిల్లా ప్రత్యేకాధికారి నారాయణభరత్ గుప్తా

పార్వతీపురం రూరల్: ప్లాస్టిక్ రహిత సమాజంలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యులు కావాలని, అలాగే ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని జిల్లా ప్రత్యేకాధికారి డా.నారాయణ భరత్ గుప్తా జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌తో కలసి పాల్గొన్నారు. ఈ మేరకు గ్రామంలో ఉన్న చెత్త సేకరణ కేంద్రాన్ని వారు పరిశీలించి వర్మీకంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో రెండు రకాల డస్ట్‌బిన్లను స్థానికులకు పంపిణీ చేశారు. వాటిలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో నిత్యావసరాలకు గుడ్డ సంచులను వినియోగిస్తున్నారని, అదే విధంగా మన జిల్లాలో కూడా ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలికి పర్యావరణానికి హానికరం లేని వస్తువులను ప్రజలు వినియోగించాలని సూచించారు. ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ, డీపీవో కొండలరావు, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఆస్తి నష్టం రూ.80లక్షలు



గోదాం యజమాని వెంకటరమణతో మాట్లాడుతున్న తహసీల్దార్ కామేశ్వరరావు, ఫైర్ ఆఫీసర్ సర్వేశ్వరరావు

వీరఘట్టం: స్థానిక యూనియన్ బ్యాంకు పక్కనే ఉన్న గోదాంలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ప్లాస్టిక్ సంచులతో పాటు జనపనార సంచులు కూడా దగ్ధమయ్యాయి. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో చెలరేగిన మంటలు శనివారం తెల్లవారుజామున 4 గంటలకు అదుపులోకి వచ్చినట్టు పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. ప్రమాదంలో సుమారు 1000 బండిల్స్ ప్లాస్టిక్ టార్పాలిన్లతో పాటు టైల్స్ కాలిపోయినట్టు గుర్తించామన్నారు. విలువైన మార్బుల్స్‌తో పాటు గోదాంలో ఉన్న స్లాబ్, గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. సుమారు రూ.80 లక్షల ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేశామన్నారు. తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందని గోదాం యజమాని కొత్తకోట వెంకటరమణను ఆరా తీశారు. ఆయనతో పాటు వీఆర్వో వి.రమేష్ నాయుడు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. శనివారం ఉదయం పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి ప్రమాద స్థలాన్ని సందర్శించారు. బాధితునితో మాట్లాడారు.

రూ.10 లక్షల సరుకును కాపాడిన యువత

యూనియన్ బ్యాంకు పక్కన ఉన్న వ్యాపార సముదాయంలో రెండు గోదాంలు ఉండగా ఒక గోదాంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ మంటలు పక్కనే ఉన్న గోదాంలోకి వ్యాపిస్తుండడంతో అందులో ఉన్న సుమారు రూ.10 లక్షల విలువ గల గోనె సంచులు ఉన్నాయి. స్థానిక కూరాకుల వీధికి చెందిన శ్రీకృష్ణా సేవా సంఘం యువత వెంటనే స్పందించి పక్క గోదాంలో ఉన్న గోనె సంచులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. యువతకు బాధితుడు వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపాడు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనిత

విజయనగరం: ప్లాస్టిక్ ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో భాగమైపోయిందని, అయితే ప్లాస్టిక్‌తో మన ఆరోగ్యాన్ని మనమే నాశనం చేసుకుంటున్నామని, ప్లాస్టిక్ అత్యంత ప్రమాదకరమని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం గంటస్తంభం నుంచి బాలాజీ కూడలి వరకు జరిగిన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం బాలాజీ కూడలిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. మూడవ శనివారం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం అనే నినాదంతో ప్రభుత్వం రాష్ట్రమంతటా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగంపై ఒక్క రోజులో మార్పు రాదనీ, ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయం చూడాలని తెలిపారు. డ్వాక్రా, మెప్మా సంఘాల ద్వారా పేపర్, జనప నార, కాటన్‌తో బ్యాగ్‌లను తయారు చేసే యూనిట్లను స్థాపించేలా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా 12 మంది పారిశుధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ , కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య, సీపీవో బాలాజీ, ఆర్డీవో కీర్తి, కార్పొరేటర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయచంద్రన్

- కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఎస్.విజయచంద్రన్

కొత్తవలస: రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి మహిళా సద్వినియోగ పర్చుకోవాలని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ సముద్రాల విజయ చంద్రన్ అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. చదువే వ్యక్తిగత అభివృద్ధికి మూలమని.. విద్యతోనే అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.వి.శ్రీదేవి, న్యాయవాదులు గొడుగుల మహేంద్ర, డి.శ్రీనివాస్, జీవీ రమణ, వెలుగు ఏపీఎం ఎం.వెంకటరమణ, ఎస్సై సీహెచ్.హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

వంట కార్మికుల తొలగింపుపై రాష్ట్రపతికి ఫిర్యాదు



మాట్లాడుతున్న మన్మథరావు, బాధిత మహిళలు

సాక్షి, పార్వతీపురం మన్యం: గిరిజన, రజక చిరు కార్మికులపై వేధింపులు ఆపి, పాఠశాలల్లో తొలగించిన వంట కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు డిమాండ్ చేశారు. బలిజిపేట ప్రజాసంఘాల కార్యాలయంలో బాధిత మహిళలు గొడబ పార్వతి, గొడబ చినపార్వతి, అరసాడ ఈశ్వరమ్మ, అరసాడప్పడు, పొట్టి కళావతిలతో కలిసి ఆయన శనివారం మాట్లాడారు. బలిజిపేట ఎంపీపీ పాఠశాలలో గిరిజన మహిళా ఆయాను, వంట సహాయకురాలిని.. జెడ్పీహెచ్ఎస్‌లో గిరిజన, రజక వంట మనుషులు, రాత్రి కాపలదారులను నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఆదేశాలతో అన్యాయంగా తొలగించారని వాపోయారు. బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలిచ్చిందని చెప్పారు. ఇక్కడ అధికారులు అమలు చేయలేదన్నారు. రాష్ట్ర గవర్నర్‌కు కూడా సమస్య వివరించామని.. అక్కడ నుంచి జిల్లా అధికారులకు లేఖ పంపినా స్పందన లేదని తెలిపారు. డీఈవో ఉద్దేశపూర్వకంగానే తాత్సారం చేస్తున్నారన్నారు. డీఈవోను అడ్డం పెట్టుకుని నియోజకవర్గ ప్రజాప్రతినిధి కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని.. తక్షణం వారిని విధుల్లోకి తీసుకోకుంటే రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.